గంగ ఒడికి గణపతి

ఆదిపూజల దేవుడు...ఆది దంపతుల సుతుడు... బొజ్జ గణపయ్య నిమజ్జనాన్ని సోమవారం భక్తులు వైభవోపేతంగా నిర్వహించారు. పందిళ్లలో ఏర్పాటు చేసిన గణపయ్యల భారీ విగ్రహాలను చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. భక్తులు ఈ కార్యక్రమాన్ని ఉత్సాహ భరితంగా నిర్వహించారు. స్వామిని పందిళ్లలో నుంచి వాహనాలపై చేర్చడానికి ముందు స్థానిక భక్తులకు అన్నదానాలు చేశారు. - సాక్షి నెట్‌వర్క్



పాతకడప చెరువులో గణపతి నిమజ్జన దృశ్యం (ఇన్‌సెట్) ద్విచక్ర వాహనంపై నిమజ్జనానికి....



విజయదుర్గ కాలనీలో నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



నిమజ్జనంలో పాల్గొన్న యువత, చిన్నారులు



గంజికుంట కాలనీలో..



బయనపల్లెలో లడ్డూ వేలం పాటలో భక్తులు



కడప నగరంలోని మారుతీనగర్‌లో గ్రామోత్సవంలో భక్తులు



కడప నగరంలో వినాయక నిమజ్జనంలో భక్తుల సందడి



రామాలయం వద్ద గణనాథుడి ఊరేగింపు

ప్రజల ప్రాణాలను గాలికొదిలేశారు

- వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం
- 9 రోజులైనా పట్టించుకోకుంటే ఎలా..
- సాయం అందక బాధితుల అవస్థలు వర్ణనాతీతం
- బాధితుల తరపున పోరాటాలకు వైఎస్సార్ సీపీ సిద్ధం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి



కడప కార్పొరేషన్: విజయవాడలో వరదలు వస్తాయని ప్రభుత్వానికి ముందే తెలిసినా లక్షల మందిని ఎలా కాపాడుతామని, వారి ప్రాణాలను గాలికొదిలేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. ఈ విషయం తాను అనడం లేదని... సాక్షాత్తు ప్రభుత్వ సీఎస్ దీన్ని అంగీకరించారన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించేటప్పుడు, వరదలు వచ్చే సమయంలో వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికలను ప్రభుత్వానికి తెలియజేస్తుందని, అప్పుడు ప్రభుత్వం వెంటనే ప్రజలను అప్రమత్తం చేయాలని, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నవారిని సురక్షిత ప్రదేశాలకు తరలించాలన్నారు. విజయవాడలో వరదలు వచ్చి తొమ్మిది రోజులు కావొస్తున్నా ఇప్పటికీ ప్రజలకు సహాయ చర్యలు అందలేదన్నారు. ఇంతవరకూ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయలేదన్నారు. వరద బాధితుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయన్నారు. వారిని ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియమించిన వలంటీర్ల సాయంతో కొద్దో గొప్పో సాయం చేశారన్నారు. సీఎం చంద్రబాబు ఇల్లు మునిగిపోకుండా, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ యాక్టివ్ పవర్ ప్లాంటు మునిగిపోకుండా కాపాడేందుకు బుడమేరు నుంచి 12 లక్షల క్యూసెక్కుల నీటిని వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా ఒక్కసారిగా విజయవాడ మీదికి వదిలారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కట్టిన రిటైనింగ్ వాల్ లేకపోయి ఉంటే లక్షలాది మంది గల్లంతయ్యేవారన్నారు. ప్రభుత్వ తప్పిదాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఎవరిపైనో నెపం వేసేందుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇంత దుర్మార్గమైన, నిర్లక్ష్యపూరితమైన ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదన్నారు.

కమలాపురం చెరువుకు నీరివ్వాలి

– ఏపీ రైతు సంఘం నేతల వినతి

కడప సెవెన్‌రోడ్స్ : మైలవరం రిజర్వాయర్ దక్షిణ కాలువ ద్వారా కమలాపురం చెరువుకు నీరు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎంవీ సుబ్బారెడ్డి, నాయకులు టి.రామ్మోహన్‌రెడ్డి, కట్టా యానాదయ్య, జి.నాగేశ్వరరావులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులను కలిసి సమస్యలను విన్నవించారు. ఈ యేడు పాపాఘ్ని నదికి నీరు రాలేదన్నారు. పాపాఘ్నికి నీరు వస్తే కమలాపురం, చదిపిరాళ్ల చెరువులకు నీరందే పరిస్థితి ఉండేదన్నారు. వర్షాలు లేకపోవడం వల్ల పాపాఘ్నిలో నీరు లేక రెండు చెరువులు ఎండిపోయి ఉన్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో మైలవరం జలాశయం దక్షిణ కాలువ ద్వారా కమలాపురం చెరువును నీటితో నింపితే కమలాపురం, మీరాపురం, సి.గోపులాపురం, పాచికలపాడు, కుప్పూరివారిపల్లె, పుట్లంపల్లె తదితర గ్రామాలకు తాగు, సాగునీరు అందుతుందన్నారు. మూడు వేల ఎకరాల్లో రైతులు రబీ పైర్లు సాగు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. మైలవరం దక్షిణ కాలువ పూర్తిగా జంబుతో నిండిపోయి ఉందని, ఇందువల్ల నీరు వచ్చేందుకు ఇబ్బంది అవుతుందన్నారు. వెంటనే జంబు తొలగించి సాగునీరు సరఫరా చేసే విధంగా నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించాలన్నారు.

వరద నష్టం అంచనాల్లో రెవెన్యూ అధికారులు

కడప సెవెన్‌రోడ్స్ : బుడమేరు బీభత్సంతో అతలాకుతలమైన విజయవాడ నగరంలో వరద నష్టం అంచనాలను తయారు చేసేందుకు జిల్లా నుంచి రెవెన్యూ అధికారులు తరలి వెళ్లారు. వీరిలో 23 మంది తహసీల్దార్లు, 65 మంది డిప్యూటీ తహసీల్దార్లు, 25 మంది రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్లు, 107 మంది ఆర్‌ఐలు, సీనియర్ అసిస్టెంట్లు కలిపి మొత్తం 220 మంది ఉన్నారు. విజయవాడలో పూర్తిగా దెబ్బతిన్న ఇళ్లు, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లు, పశు సంపద నష్టం, కల్వర్టులకు జరిగిన నష్టం, నీట మునిగి ఇంకా బయటపడని ఇళ్లు, ఇంటి సామాగ్రి కొట్టుకునిపోవడం వల్ల జరిగిన నష్టాలను రెవెన్యూ అధికారులు బాధితుల ద్వారా తెలుసుకుని నివేదికలు తయారు చేసే పనిలో ఉన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమిద్దాం

కడప ఎడ్యుకేషన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ సమస్యల పట్ల చిత్తశుద్ధితో పనిచేయడం లేదని, ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి చేయకుండా కార్పొరేట్ విద్యను ప్రోత్సహిస్తున్నాయని ఏఐఎస్‌బి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ అన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. సోమవారం కడపలో జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలలో భాగంగా ప్రతి విద్యార్థి చదువు కొనుటకు ప్రతి సంవత్సరం 15 వేల రూపాయలు అందజేస్తామని హామీ ఇచ్చిందన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక మాట తప్పారని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్దుల్లా, ఆసిస్, చరణ్, ముబాకర్, అన్వర్‌బాష, నవీన్, అజమతుల్లా పాల్గొన్నారు.

ఏఐఎస్‌బి జిల్లా కన్వీనర్‌గా సగిలి రాజేంద్ర

అఖిల భారత విద్యార్థి బ్లాక్(ఏఐఎస్‌బి) కడప జిల్లా కన్వీనర్‌గా సగిలి రాజేంద్ర ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ ఈ విషయాన్ని ప్రకటించారు. రాజేంద్ర విద్యారంగ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తూ విద్యార్థులకు అందుబాటులో ఉంటాడని ఆయన తెలిపారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

కడప రూరల్ : తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులురెడ్డి జన్మదిన వేడుకలు కడప నగరంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక జెడ్పీ సమీపానగల పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో శ్రీ సాయి యువజన సేవా సంఘం చైర్మన్ మలిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తిరుమలశెట్టి రఘురాం, మున్సిపల్ కోటర్స్ శ్రీనివాసులు, వల్లిబాష , జనసేన నాయకులు పాల్గొన్నారు.

సేవతోనే సంతృప్తి



రిమ్స్ ఆవరణలో అన్నదానం చేస్తున్న దృశ్యం

కడప కోటిరెడ్డిసర్కిల్ : సేవతోనే నిజమైన సంతృప్తి లభిస్తుందని బీఎస్‌ఆర్ ఫౌండేషన్ ప్రతినిధి బీచు నరేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం రిమ్స్ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రతినెలా 2వ సోమవారం కడప రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో పేదలకు, నిరాశ్రయులకు అన్నదానం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నగరవాసులు బీచు అక్కయ్య, బీచు వీణావాణి, కియాన్సి బీచు, శివనాగిరెడ్డి, చేతన్‌రెడ్డి, హిమశివశంకర్‌రెడ్డి, వలంటీర్లు వై.హరినారాయణ రావు, శ్రీనివాసులురెడ్డి, సుబ్బరాయడు, రాజశేఖర్, రామకోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పెయిడ్' ఆధ్వర్యంలో వరద సహాయక చర్యలు



సరుకులు అందజేసేందుకు సిద్ధం చేస్తున్న స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులు

కడప సెవెన్‌రోడ్స్ : విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు కడప నగరానికి చెందిన పీపుల్స్ యాక్షన్ ఇన్ డెవలప్‌మెంట్ (పెయిడ్) స్వచ్ఛంద సంస్థ నడుం బిగించింది. పెయిడ్ అధ్యక్షులు కె.నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో 20 మంది కార్యకర్తలు సోమవారం విజయవాడకు బయలుదేరి వెళ్లారు. అమెజాన్ సహకారంతో విజయవాడలోని రాజరాజేశ్వరిపేట, రాజీవ్‌నగర్, ప్రకాశ్‌నగర్‌లలో సహాయక చర్య ల్లో పాల్గొంటున్నారు. బాధితులకు తక్షణ సాయం కింద ఎంటీఆర్ గోధుమ పిండి, తాగునీరు, పాలపొడి, బిస్కెట్లు, మందులు, దుప్పట్లు తదితర 14 రకాల వస్తువులను అందజేయనున్నారు.

క్లుప్తంగా

ఫిర్యాదులను పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రన్

కడప కార్పొరేషన్: ప్రజా ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని నగరపాలక అదనపు కమిషనర్ రాకేష్ చంద్రన్ ఆదేశించారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో నిర్వహించిన 'మీ కోసం' కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజా పరిష్కారం కోసం తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్, సిటీ ప్లానర్ సూరజ్ కుమార్ పాల్గొన్నారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న ఎన్‌సీసీ కేడెట్స్

వైవీయూ: ఆరోగ్యవంతమైన సమాజం కోసం రక్తదానం చేయాల్సిన ఆవశ్యకత ప్రతి పౌరుడిపై ఉందని 30 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎన్. సూర్యనారాయణ మూర్తి పేర్కొన్నారు. కడప నగరం తెలుగుగంగకాలనీలో నిర్వహిస్తున్న కంబైన్డ్ ఆన్యువల్ ట్రైనింగ్ క్యాంపు (సీఏటీసీ)లో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కల్నల్ మాట్లాడుతూ ప్రతి ఆరోగ్యవంతమైన పౌరుడు మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చన్నారు. కడప రిమ్స్ బ్లడ్ బ్యాంకు నిర్వహణాధికారి డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం 30 మంది ఎన్‌సీసీ కేడెట్స్ రక్తదానం చేశారు.

డిజిటల్ లిటరసీపై అవగాహన పెంచుకోవాలి

వైవీయూ: ప్రస్తుత సాంకేతిక యుగంలో డిజిటల్ లిటరసీపై అవగాహన పెంచుకోవాలని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వేమల సలీంబాషా పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాంలో భాగంగా డిజిటల్ లిటరసీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కంప్యూటర్ యుగంలో ఉన్నామని, సాంకేతికంగా ముందుండాలని సూచించారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఎ. హరిత , ఎస్ఐపీ కోఆర్డినేటర్ డా. కె. ప్రకాష్ నారాయణరెడ్డి, డా. గురుమోహన్‌రెడ్డి, కుమార్, వీణ పాల్గొన్నారు.

13న వేలంపాట

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయంలో ఈనెల 13న అమ్మవారి చీరెలను వేలం వేయనున్నట్లు ఈఓ శ్రీధర్ తెలిపారు. ఉదయం 10 గంటలకు దేవాదాయశాఖ అధికారుల సమక్షంలో బహిరంగ వేలం ద్వారా చీరెలను విక్రయిస్తామన్నారు. పూర్తి వివరాలకు 73963 54149 నంబరులో సంప్రదించాలన్నారు.

వేడుకగా గణనాథుడి ఉత్సవాలు



ఎన్జీవో కాలనీలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటిని సన్మానిస్తున్న విగ్రహ కమిటీ సభ్యులు



10వ డివిజన్‌లో వినాయక విగ్రహం వద్ద మేయర్ సురేష్ బాబును సన్మానిస్తున్న దృశ్యం



నాగరాజుపేటలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: కడప నగరంలో గణనాయకుని ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం ఎన్జీవో కాలనీలోని భారీ వరసిద్ధి వినాయకుని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం విగ్రహకమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో 10వ డివిజన్ కార్పొరేటర్ మల్లికార్జున, మాజీ కార్పొరేటర్లు ఏ. రాజగోపాల్‌రెడ్డి, చిన బాబు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మెన్ అందూరి రాంప్రసాద్‌రెడ్డి, కోలా కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

– కడప నగరంలో 10వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద నగర మేయర్ కె. సురేష్ బాబు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం విగ్రహ కమిటీ సభ్యులు మేయర్‌కు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

– నాగరాజు పేటలో 23వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ఐస్ క్రీమ్ రవి ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బి అంజద్‌బాషా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సుభాన్ భాషా, దాసరి శివ, 30వ డివిజన్ కార్పొరేటర్ షఫీ, 31వ డివిజన్ కార్పొరేటర్ అజ్మతుల్లా పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమం



కడప కల్చరల్ : కడప నగరం బెల్లంమండివీధిలోని శ్రీ ప్రసన్న విఘ్నేశ్వరస్వామి ఆలయంలో వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని మూడు రోజులుగా ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు. మూడవరోజు ఆలయం వద్ద అర్చకులు చంద్రమౌళి శర్మ నిర్వాహకులు వాంఛ కల్పలత వైనాయకి హోమాన్ని భక్తులచే నిర్వహింపజేశారు. ఆలయం ఎదురుగా హోమ గుండాలను ఏర్పాటు చేసి దంపతులు, కుటుంబ సభ్యులు సంప్రదాయ దుస్తుల్లో హాజరై హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు స్థానిక భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు.

విరిగి పడిన విద్యుత్ స్తంభం



కడప ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో డివైడర్‌లో నుంచి విరిగిపడిన విద్యుత్ స్తంభం

కడప అర్బన్/ కడప కార్పొరేషన్ : కడప ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఇన్‌గేట్ దగ్గర హోటల్ ఎదురుగా వున్న డివైడర్‌లో విద్యుత్ స్తంభం ఒక్కసారిగా విరిగి కిందపడింది. ఒక కారు, ద్విచక్ర వాహనం మీద పడింది. కానీ ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. సంఘటన స్థలానికి పోలీసులు వచ్చి పరిశీలించారు.

ఆయాలు, వాచ్‌మెన్లకు వేతనాలు ఇవ్వాలి

– కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఆయాలు, వాచ్‌మెన్‌లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.వేణుగోపాల్, ఎల్.నాగసుబ్బారెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లాలు మాట్లాడుతూ ఆయాలకు ఐదు నెలల నుంచి, వాచ్‌మెన్‌లకు ఆరు నెలలుగా వేతనాలు అందకపోవడంతో పలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యాశాఖలో పనిచేస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత లేదన్నారు. నెలంతా పనిచేసినా రూ. 6 వేలు మాత్రమే ఇవ్వడం అన్యాయమన్నారు. ఆ వేతనం కూడా పెండింగ్ పెట్టడం సరికాదన్నారు. వేతనాలు, గౌరవ భృతి, పారితోషికాలు చెల్లించకపోవడం విచారకరమన్నారు. ఒకటో తేదిన జీతాలు ఇస్తామన్న ప్రభుత్వం నెలలు గడిచినా ఇవ్వకపోవడాన్ని ఏమనాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు చాంద్‌బాష, లింగన్న, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆయాలు, వాచ్‌మెన్లు, ఏఐటీయూసీ నాయకులు

పాలకొండ్రాయస్వామికి స్వర్ణాభరణం



ఆలయ అధికారులకు స్వర్ణాభరణాన్ని అందజేస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగర శివార్లలోని పాలకొండల్లోగల శ్రీ పాలకొండ్రాయస్వామికి అన్నమయ్య జిల్లా నందలూరు మండలం నల్లతిమ్మాయపల్లె వాసులు కె.చిన్నపరెడ్డి, కె.జయమ్మ కుటుంబ సభ్యులు స్వర్ణాభరణాన్ని అందజేశారు. 11 గ్రాముల 221 మిల్లీ గ్రాముల బరువుగల డాలర్‌తో కలిసి ఉన్న ఈ ఆభరణాన్ని దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ బి.రెడ్డెయ్య, కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి ఎ.శ్రీధర్, ఆలయ అర్చకులు కె.యోగీష్, సిబ్బందికి అందజేశారు.

సమస్యకు ఆత్మహత్య పరిష్కారం కాదు

ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కాదని, పైగా ఆ సమస్యను రెట్టింపు చేస్తాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మంగళవారం ఆత్మహత్యల నివారణ దినోత్సవం. ఈ సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.

కడప కల్చరల్: జీవించి ఉన్నంత వరకే అన్ని ఆనందాలు అందుతాయని, ఆత్మహత్యతో ఆనందమయ జీవితాన్ని మధ్యలో అంతం చేసుకోవడం అవివేకమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అది సమస్యను ఇంకా జఠిలం చేస్తుందని హెచ్చరిస్తున్నారు. చాలామంది క్షణికావేశంలో విలువైన జీవితాన్ని ఆత్మహత్యతో అంతం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఆత్మహత్యల సమస్య అధికంగా ఉందని, 2022లో 1.71 లక్షల ఆత్మహత్యలు జరిగాయని, గత సంవత్సరంతో పోలిస్తే ఇది 4.2 శాతం ఎక్కువని తెలిపారు. సగటున ప్రతి లక్ష మందికి 12 మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నట్లు తెలిపారు. 2018తో పోలిస్తే ఇది 27 శాతం అధికమని, ప్రతి ఏడాది ఇలా ఆత్మహత్యలు చేసుకునేవారి శాతం పెరుగుతుండడం ఈ అంశంపై ప్రజల్లో అవగాహన లేమిని తెలుపుతోందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత వ్యక్తిగత సమస్యలు, ఆర్థిక కష్టాలు, ప్రేమ వివాహ సమస్యలు, చెడు అలవాట్ల బారిన పడి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు.

ఆత్మహత్యలు నివారించవచ్చు..



ఆత్మహత్యలు వంద శాతం నివారించవచ్చు. వాటి గురించి ఆలోచన రావడమే తప్పు అని అవగాహన కల్పించాలి. స్నేహితులు, బంధువుల్లో సరిగా కలవకపోవడం, ఎక్కువగా దిగులు, ఒంటరిగా ఉండడం, నిరాశగా మాట్లాడటం, పదేపదే పశ్చాత్తాపం చెందడం, ఆత్మహత్య ప్రయత్నం చేసి ఉండడం .. ఇలాంటి వారిని ముందుగానే గుర్తించి కౌన్సెలింగ్ ఇప్పించాలి. అందుకోసం టెలీమ్యానస్ 14416 టోల్ ఫ్రీ నెంబరు 24 గంటలు అందుబాటులో ఉంటుంది. ఈ నెంబరుకు ఫోన్ చేసి నిపుణుల ద్వారా కౌన్సెలింగ్ పొందవచ్చు. ఇందులో కుటుంబం, స్నేహితుల పాత్ర ప్రధానం. సమస్యలు గల వ్యక్తిని గుర్తించి మానసికంగా అండగా నిలువాలి. ఆత్మహత్య పరాజయానికి గుర్తు, దాని జోలికి పోకుండా ఆత్మీయులు, కౌన్సెలింగ్ ద్వారా శాశ్వతంగా ఆ సమస్య నుంచి బయటపడవచ్చు.

– కవిత ప్రసన్న, కన్సల్టెంట్ సైక్రియాటిస్ట్ డాక్టర్